సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 6 । మార్చి । 2024



పరిశోధనాత్మక విద్యకు..

జీఆర్‌ఏయూలో వైబ్రంట్ విస్టా ప్రారంభమైంది. నేడు కూడా కార్యక్రమం కొనసాగనుంది.

- 8లో



ఇన్‌పుట్ సబ్సిడీ నేడు

రైతులకు నేడు ఇన్‌పుట్ సబ్సిడీ వేయనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేశారు.

- 8లో

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు అత్యంత పకడ్బందీగా కొనసాగుతున్నాయి. జిల్లాలో 83 కేంద్రాల్లో మంగళవారం సెట్-2 ప్రశ్న పత్రంతో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇంగ్లిష్ పేపర్‌కు పరీక్ష రాశారు. నాల్గో రోజు జనరల్ విద్యార్థులు 18546 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 17954 మంది పరీక్ష రాశారు. 592 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విభాగంలో 43 మంది డుమ్మా కొట్టారు.

న్యూస్‌రీల్

7న మహిళా దినోత్సవ వేడుక



ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తెలిపారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయినప్పటికీ శుక్రవారం శివరాత్రి పర్వదినం కావడంతో ఒకరోజు ముందు అంటే గురువారం నాడు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని మహిళా ఉద్యోగులతో మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు శాంతిశ్రీ తెలిపారు. ఈ వేడుకలు శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రోడ్డులోని కోడిరామ్మూర్తి మైదానం వద్ద గల అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులందరూ ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని శాంతిశ్రీ కోరారు.

'భారత ప్రజాస్వామ్యం ఎంతో గొప్పది'

టెక్కలి: అన్ని దేశాల కంటే భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతో గొప్పదని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి మాక్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి మారుమూల ప్రాంతానికి విద్య, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యార్థులకు ఏదైనా సాధించాలనే తపన ఉండాలని ఆయన సూచించారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, నెహ్రూ యువకేంద్రం గణాంకాధికారి శ్రీనివాసరావు, ఆదిత్య కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎ.రాజేష్, డి.విష్ణుమూర్తి, బి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ నిర్ధారణపై అవగాహన



మాట్లాడుతున్న సీపీఓ లక్ష్మీ ప్రసన్న

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల వ్యయ నిర్ధారణలో వీడియోగ్రఫీ పాత్ర కీలకమని సీపీఓ లక్ష్మీ ప్రసన్న అన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో వీడియో సర్వేలెన్స్ టీమ్‌ల కోసం వీడియోగ్రాఫర్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకట్ రామన్, డీసీఓ బాలాజీ నాయక్ మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన కల్పించారు. వీడియోగ్రాఫర్లు సంఘటనలను చిత్రీకరించాలని, పోస్టర్లు, వాహనాలు, కటౌట్లు, బ్యానర్లు, ఫర్నీచర్ తదితర అంశాలను చిత్రీకరించాలని సూచించారు. ఆయా కార్యక్రమాలు రికార్డు చేసిన తేదీ, స్థలం, పార్టీ వివరాలను వాయిస్ మోడ్ ద్వారా నిక్షిప్తం చేయాలన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ వీడియోగ్రఫీ నిర్వహణలో పలు సాంకేతిక వివరాలు వివరించారు.

రామస్వామికి ఉత్తమ లైన్‌మ్యాన్ అవార్డు



ఢిల్లీలో ఉత్తమ లైన్‌మ్యాన్ అవార్డు అందుకున్న రామస్వామి (పసుపు హెల్మెట్ పెట్టుకున్న వ్యక్తి)

ఆమదాలవలస రూరల్: మండలంలో రూరల్ సెక్షన్ పరిధి అక్కులపేట పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మ్యాన్ మీసాల రామస్వామికి ఉత్తమ లైన్‌మ్యాన్ అవార్డు దక్కింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నేతృత్వంలో టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీ నిర్వహించిన లైన్‌మెన్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డును సోమవారం అందుకున్నారు. ఉద్యోగంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, సమయంతో సంబంధం లేకుండా నిరంతరం వినియోగదారులకు సేవలు అందించాలని పనిచేయడంతో ఈ అవార్డు దక్కింది. రామస్వామికి ఉత్తమ లైన్‌మ్యాన్ అవార్డు రావడంపై ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఈఈ బయ్యన్నాయుడు, డీఈ భాస్కరరావు, రూరల్ ఏఈ బి.రవికుమార్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, తోటి ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

ఆస్పత్రే ఆశాకిరణం



భవానీ

ఉద్దానం ఆశాకిరణంగా భావిస్తున్న పలాస కిడ్నీ ఆస్పత్రి తన పని మొదలుపెట్టింది. ఇన్నాళ్లూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం శ్రీకాకుళం, ఆపరేషన్ల కోసం విశాఖ పరుగులు పెట్టిన జిల్లా వాసులకు ఇప్పుడు పలాసలోనే శస్త్ర చికిత్స చేయించుకునే భాగ్యం లభించింది. పలాసకు దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న లావేరు మండలం నుంచి వోయివోని భవానీ అనే పేషెంట్ కిడ్నీ ఆస్పత్రికి వచ్చి ఏవీఎఫ్ గ్రాఫ్ట్ అనే ఆపరేషన్ చేయించుకున్నారు. డయాలసిస్ పేషెంట్లకు నరాలు బలహీనమైపోయిన దశలో ఓ యంత్రం అమర్చి దాని ద్వారా రక్తశుద్ధి చేసి శరీరంలోకి రక్తం పంపడం ఈ ఆపరేషన్ ఉద్దేశం. ఇన్నాళ్లూ ఈ శస్త్ర చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వేలాది రూపాయలు ధారబోయాల్సి వచ్చేది. ఇప్పుడు కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఉచితంగా జరగడంతో వేలాది మందికి భరోసా ఏర్పడింది. మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం ఆస్పత్రిని సందర్శించారు. కిడ్నీ పరిశోధన కేంద్రంపై విమర్శలు చేస్తున్న విపక్షాలు ఓ సారి కంటి ఆపరేషన్ చేసుకుని తమ ఆస్పత్రి పనితీరు గమనించాలని ఆయన చురకలు అంటించారు.

– కాశీబుగ్గ



పలాసలో కిడ్నీ ఆస్పత్రి

పొలం కడుపు చల్లగా..



ఏళ్ల తరబడి జల్లుతున్న రసాయన ఎరువులు పొలం కడుపును గుల్ల చేస్తున్నాయి. ఇష్టానుసారం వాడుతున్న పురుగు మందులు సాగు క్షేత్రాన్ని కాలుష్య కాసారంగా మారుస్తున్నాయి. మట్టిలో ఇంకిపోయిన ఈ అవశేషాలు భూమితో పాటు పంటలో ఉన్న సారాన్ని కూడా తినేస్తున్నాయి. విచక్షణారహితంగా సాగుతున్న ఈ విధ్వంసం తక్షణం ఆపాల్సిన దశకు చేరుకుంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ప్రభుత్వం జీవ నియంత్రణ ల్యాబ్ ద్వారా అన్నదాతకు సాయం చేయడానికి పూనుకుంది. సస్యరక్షణ చర్యలు సమగ్రంగా వివరించడం, తక్కువ ధరకు జీవ ఎరువులు విక్రయించడం వంటి పనులు చేసేందుకు ఆమదాలవలసలో తొలి ల్యాబ్‌ను ప్రారంభించింది.



ఆమదాలవలస పట్టణంలో నిర్మించిన జీవ నియంత్రణ ల్యాబ్

- రైతులకు అందుబాటులో జీవ నియంత్రణ ల్యాబ్
- జిల్లాలో మొదటిసారిగా ఆమదాలవలసలో ఏర్పాటు
- ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తికి దోహదం

ల్యాబ్‌లో ఏం చేస్తారు..?

జీవ నియంత్రణ ల్యాబ్‌లో తయారైన జీవ ఎరువులు, జీవ శిలీంధ్ర నాశినులను వ్యవసాయశాఖ రైతులకు అతి తక్కువ ధరలతో రాయితీపై అందిస్తుంది. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు రైతులు పొందేందుకు ఈ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లాలోనే మొట్టమొదటి సారిగా ఆమదాలవలస పట్టణంలో ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూమిలో తగ్గుతున్న సూక్ష్మజీవుల్లో మొక్కలకు పోషక పదార్థాలు, పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చే జీవ ఎరువులను ల్యాబ్‌లో తయారుచేస్తారు. వీటి వాడకం వల్ల రసాయన ఎరువుల మోతాదు కొంత మేర తగ్గించుకోగలుగుతారు.



జీవ నియంత్రణ ల్యాబ్‌లో ఎరువుల తయారీ కోసం ఉపయోగించనున్న పరికరాలు

రైతుల కోసమే ల్యాబ్



జిల్లాలోనే మొదటిసారిగా రైతుల కోసం ఆమదాలవలసలో జీవ నియంత్రణ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం ఎంతో ఆనందాయకం. రైతులను వ్యవసాయ సాగులో లాభసాటిగా మార్చేందుకు ఈ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ల్యాబ్ గురించి రైతులకు అవగాహన కల్పిస్తాం. వీటి ద్వారా రైతులకు చేరాల్సిన ఎరువులను సకాలంలో సరఫరా చేస్తాం. రైతులు ఈ ల్యాబ్‌ను ఉపయోగించుకుని వ్యవసాయ సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రైతులు కృషి చేయాలి.

– కె.శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ

ఆమదాలవలస రూరల్: రసాయన ఎరువుల వాడకం తగ్గాలి. పురుగు మందుల వినియోగం ఆపాలి. పంట ఆరోగ్యవంతంగా ఉండాలి. భూమి సారవంతం కావాలి. ఇవన్నీ జరగాలంటే సాగు పద్ధతి మారాలి. పంటలో పురుగులు, తెగుళ్లను నివారించడానికి హానికర రసాయనాలను విచక్షణ రహితంగా అధిక మోతాదులో పంటలపై ఉపయోగించడం వల్ల పర్యావరణం కాలుష్యం జరుగుతోంది. దీంతో పాటు తినే ఆహార పదార్థాలు విషతుల్యం అవుతున్నాయి. దీని వల్ల మానవులకు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు సమగ్ర సస్యరక్షణ చర్యలు రూపొందిస్తున్నారు. మరోవైపు జీవ ఎరువుల వినియోగం పెరిగితే రసాయన ఎరువుల వాడకం తగ్గి రైతులకు సాగు ఖర్చు తగ్గుతుందని, భూమి కూడా బాగు పడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జీవ సంబంధ శిలీంధ్ర నాశినులను ఉపయోగించడం వల్ల ఆహార పదార్థాలపై అవశేషాల ప్రభావం తగ్గి ఆరోగ్యవంతమైన, నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. దీని వల్ల రైతులకు మంచి ధరలకు వచ్చే అవకాశాలు ఉంటాయి. అందుకే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జీవ నియంత్రణ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది.

దీనిలో భాగంగా ఆమదాలవలస పట్టణంలో మార్కెట్‌యార్డు ఆవరణలో రూ. 1.35 కోట్ల వ్యయంతో ఈ ల్యాబ్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

జీవన ఎరువుల వల్ల ఉపయోగాలు

వాతావరణ కాలుష్యం అరికట్టవచ్చు. నేలలో మొక్కలు తమంత తాము ఉపయోగించుకోలేని పోషకాలను వాటికి అందుబాటులోకి తెస్తాయి. హార్మోన్లు, విటమిన్లు, మొక్కకు లభ్యమై పెరుగుదల వేగంగా, ఆరోగ్యకరంగా ఉంటుంది. నేల నుంచి సక్రమించే తెగుళ్లను కొంత వరకు అరికట్టవచ్చు. భూసారం అభివృద్ధి చెందుతుంది. సాధారణ దిగుబడులు 10–12 శాతం వరకు పెరుగుతుంది. దీంతో పాటు రసాయనిక ఎరువులు 20–25 శాతం వాడకాన్ని తగ్గించవచ్చును.

అందుబాటులో జీవ శిలీంధ్ర నాశినులు

జీవ నియంత్రణ ల్యాబ్‌లో ప్రస్తుతానికి జీవ శిలీంధ్ర నాశినులు ట్రికో డెర్మావిరిడి, సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్‌లను ద్రవ, పొడి రూపంలో రైతులకు సరఫరా చేస్తున్నారు. వరి, అరటి పంటలకు సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ వ్యాధుల నిర్మూలనలో కాలుష్య రహిత వాతావరణానికి ఉపయోగపడుతుంది. వరిలో ఎండు ఆకు తెగులు, పాము పొడ తెగులు, అగ్గి, పొట్ట కుళ్లు తెగుళ్లను నివారిస్తుంది. రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, పాస్ఫో బ్యాక్టీరియా, పాస్పేటు, పోటాషియం మొబిలైజర్స్ వంటివి త్వరలోనే రైతులకు అందుబాటులోకి వస్తాయి. జీవ నియంత్రణ ఎరువులు తయారుచేయడానికి అన్ని రకాల పరికరాలు ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు రాయితీపై జీవన ఎరువులు సకాలంలో అందించడం జరుగుతుంది.

ప్రశాంత వాతావరణంలో శివరాత్రి ఉత్సవాలు

- డీఐజీ విశాల్ గున్నీ



ఎస్పీ జీఆర్ రాధికతో మాట్లాడుతున్న డీఐజీ విశాల్ గున్నీ

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని విశాఖ డీఐజీ విశాల్ గున్నీ అన్నారు. ఆయన మంగళవారం శ్రీముఖలింగం వచ్చి స్వామి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ ఏర్పాట్లపై పోలీసులు, ఆలయ అధికారులతో మాట్లాడారు. ప్రతి భక్తునికి స్వామి దర్శనం చేయించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉత్సవాలకు వచ్చే పోలీసు అధికారుల వసతిపై తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వంశధారలో పుణ్యస్నానాలు అనంతరం తిరుగు ప్రయాణంలో భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతోపాటు ఎస్పీ జీఆర్ రాధిక, నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు, ఎస్‌ఐ కె.మధుసూదనరావు అర్చకులు, సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి పట్టివేత

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో పది కిలోల గంజాయి బ్యాగులతో 21 ఏళ్ల యువకుడు అరెస్టయ్యాడు. పలాస ఆర్పీఎఫ్ ఎస్‌ఐ మలయాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పలాస రైల్వేస్టేషన్‌కు బ్యాగులతో ఓ యువకుడు వచ్చాడు. ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అనుమానం వచ్చిన ఆర్పీఎఫ్ ఎస్‌ఐ మలయాద్రి, సిబ్బంది తనిఖీలు చేయగా ఐదు ప్యాకెట్‌లలో పది కిలోల గంజాయి దొరికింది. తక్షణమే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఒడిశాలోని గజపతి జిల్లా, ఆర్‌–ఉదయగిరికి చెందిన సిద్ధానాథ్ మాలి (21)గా గుర్తించారు.

శివసాగర్ తీరంలో ఎలుగు



శివసాగర్ తీరంలో సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలో మంగళవారం ఎలుగు హల్ చల్ చేసింది. ఈ ఎలుగు పరిసర జీడి తోటల వెంబడి తీరంలోకి ప్రవేశించింది. దీంతో బీచ్‌లో అప్పటి వరకు సరదాగా గడుపుతున్న పర్యాటకులు ఎలుగును చూసి ప్రాణభయంతో పరుగులు తీశారు. రాత్రి సమయాల్లో ఎలుగులు గ్రామ వీధుల్లో సంచరించడంతో ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎలుగుల సంచారాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ల్యాండ్ టైట్లింగ్‌తో భూ వివాదాలకు తెర

- ఈ చట్టంపై అపోహలు, భయాలు వద్దు
- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ చట్టం–2023 వల్ల భూ వివాదాలు, మోసాలను అరికట్టి యాజమాన్య హక్కుపై పూర్తి భరోసా కల్పించే అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. 'హక్కులకు హామీ–రైతుకు భరోసా' పేరిట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలసి జిల్లాలోని రైతులు, రెవెన్యూ అధికారులు, అడ్వకేట్లు, పోలీసులకు ఈ చట్టంపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు.

సుదీర్ఘ ప్రసంగం

ఈ చట్టం వల్ల ప్రయోజనాలేంటి? ఎలాంటి మార్పులు వస్తాయి? రెవెన్యూ రికార్డుల్లో నమోదు, భూ వివాదాల పరిష్కారం, కొత్త చట్టంలో సివిల్ కోర్టుల పాత్ర, రికార్డుల నిర్వహణ వంటి అన్ని అంశాలపై అజేయ కల్లం సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు దేశంలోని 12 రాష్ట్రాలు ఆసక్తి చూపిస్తున్నాయని, భూములకు శాశ్వత హక్కు రావాలంటే ఈ చట్టం అమలు జరగాల్సిందేనని చెప్పారు. యజమాని ఎక్కడున్నా భూమికి రక్షణ అవసరమని, మొబైల్ ఫోన్‌లో భూమి వివరాలను చెక్ చేసుకునే సౌలభ్యం ఉంటుందని వివరించారు. ఎవరైనా మార్పులు, చేర్పులకు ప్రయత్నిస్తే మనకు సమాచారం కూడా వస్తుందన్నారు. దేశంలోని న్యాయ వ్యవస్థలో 66 శాతం కేసులు సివిల్ తగాదాల వల్లనే ఉంటే, మరో 14 శాతం హత్యలు భూ తగాదాలకు సంబంధించినవి నడుస్తున్నాయని, మిగిలిన దేశాల్లో కేవలం 3 శాతం సివిల్ వివాదాలు మాత్రమే నమోదవుతున్నాయని వివరించారు.

ఆధునిక టెక్నాలజీతో సర్వే

రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేలో భాగంగా 6000 గ్రామాల్లో సర్వేను పూర్తి చేసిందని, ఎయిర్ క్రాఫ్ట్, రోవర్, డ్రోన్లు వంటి ఆధునిక టెక్నాలజీ ద్వారా ప్రతి భూ సరిహద్దును జియో రిఫరెన్స్ చేసి రైతులకు భూ హక్కు పత్రాలను జారీ చేసే విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. మొత్తం టైటిల్ రికార్డులు సురక్షితమైన ఆన్‌లైన్ విధానంలో నిల్వ చేసి, పాత భూరికార్డులకు స్వస్తి పలికి రైతులకు శాశ్వత హక్కులు కల్పించే దిశగా ఈ చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. వివాదాలుంటే సర్వే, హద్దుల చట్టం కింద సంబంధిత అధికారులను గానీ, సివిల్ కోర్టును గానీ ఆశ్రయించవచ్చని, కుటుంబ సభ్యుల మధ్య భాగాల పంపిణీ, వారసత్వ తగాదాలు ఉంటే సివిల్ కోర్టులు ఎప్పటి లాగానే పరిష్కరిస్తాయని చెప్పారు. ఆస్తి పన్నులు, ఇతర వివాదాలు, కేసులు ఉంటే న్యాయస్థానాలు పరిష్కరిస్తాయనే విషయాన్ని గుర్తెరిగి ఉండాలని తెలిపారు. రికార్డుల వివరాలపై అభ్యంతరాలుంటే చట్టంలో పేర్కొన్న కాల వ్యవధిలో అప్పీలు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 6000 గ్రామాల్లో సర్వే జరగ్గా కేవలం 2 శాతం వివాదాలు మాత్రమే వ్యక్తమయ్యాయని ఆయన వివరించారు.

కార్యక్రమంలో సర్వే లాండ్ రికార్డుల అడిషనల్ కమిషనర్ ఆర్.గోవింద రావు మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంపై అవగాహన కల్పించారు. విశ్రాంత జాయింట్ కలెక్టర్ పి.రజనీకాంతారావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు జి.వాసుదేవరావు, ఆగూరు ఉమామహేశ్వరరావు, బొడ్డేపల్లి మోహనరావు, ముద్దాడ కృష్ణారావు, పీసీ గోపి ఈ చట్టంతో రానున్న మార్పులపై మాట్లాడారు. ఎల్‌డీఎం సూర్యకిరణ్ బ్యాంకర్లు రుణాలు ఇచ్చే సమయంలో వచ్చే ఇబ్బందులపై సందేహాలు అడిగి తెలుసుకున్నారు. కంఠవేణు, చిక్కాల గోవిందరావు, జీపీ వినయభూషణ్, ఏజీపీ గోవిందరావు, చౌదరి లక్ష్మణరావు, పలువురు న్యాయవాదులు ప్రజా సంఘాల వారు, రైతులు పాల్గొన్నారు. అనంతరం సదస్సుకు వచ్చిన పలువురు అడిగిన సందేహాలను అజేయ కల్లం నివృత్తి చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య, ఏడీ సర్వేయర్, పలువురు అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

తిరువీధుల మెరసీ..



మందస పురవీధుల్లో స్వామివారి రథోత్సవం

మందస: మందస వాసుదేవుడు తిరువీధుల్లో దేవేరులతో విహరించాడు. శ్రీత్రిదండి రామానుజ శ్రీమన్నారాయణ చిన్నజీయర్‌స్వామి ప్రధాన శిష్యులు శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి, శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, పవన్‌కుమార్‌ఆచార్యులతో పాటు వేదపండితులు, అర్చకులు గోవింద నామస్మరణ చేస్తుండగా మంగళవారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. దారి పొడవునా ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసి, స్వామిని ఆహ్వానించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శానాపతి కిశోర్‌కుమార్, జామి ఈశ్వరవెంకటవరప్రసాదరావు, జల్లు కాశీచరణ్, దేవరశెట్టి మార్కండేయులు, కరతల తిరుపతిరావు, శ్రీవాసుదేవసేవాసమితి నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు పోటెత్తారు. స్వామికి చక్రతీర్థ, అవభృద స్నానాలు చేశారు.

బాలికే ఏలిక



బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆడపిల్లలను రక్షించుకుని వారిని చదివించాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ శోభారాణి అన్నారు. శ్రీకాకుళం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని చేపలవీధి అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు మంగళవారం పురపాలక బాలికల ఉన్నత పాఠశాల నుంచి బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లల సంరక్షణపై ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మి, ఎంఎస్‌కే హిమబిందు, పర్వీనాబేగం, జరీనాబేగం, అంగన్వాడీ కార్యకర్తలు సంధ్య, నాగమణి, రోజా, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం అర్బన్

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో అడిషనల్ డీజీ బన్సల్



బన్సల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హైదరాబాద్ రీజియన్ సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అడిషినల్ డీజీ సిసిర్ బన్సల్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, ఇప్పిలి సాందీప్ శర్మలు ఆలయ విశిష్టతను వివరించారు.

క్యారమ్స్ పోటీల్లో ఉద్దానం క్రీడాకారుల ప్రతిభ



రన్నరప్‌గా ట్రోఫీ అందుకుంటున్న ఢిల్లేశ్వరరావు

కవిటి: ఆంధ్రప్రదేశ్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్, రాష్ట్రస్థాయి ఓపెన్ క్యారమ్స్ టోర్నీలో కవిటి మండలం జగతి గ్రామానికి చెందిన లమ్మత హరిప్రియ, ప్రగడపుట్టుగకు చెందిన బార్ల ఢిల్లేశ్వరరావు ప్రతిభ కనబరిచారు. ఫైనల్స్ పోరులో స్వల్ప తేడాతో విశాఖపట్నం జిల్లా క్రీడాకారులతో ఓటమి చెంది రన్నరప్‌గా నిలిచారు. వీరు సాధించిన విజయం పట్ల రాష్ట్ర క్యారమ్స్‌సంఘం ఉపాధ్యక్షుడు పూడి నేతాజీ హర్షం వ్యక్తం చేశారు.

సారా స్థావరాలపై ఎస్ఈబీ దాడులు



దాడుల్లో పాల్గొన్న ఎస్ఈబీ అధికారులు

మందస: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషినల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మంగళవారం నాటుసారా తయారీ, అమ్మకాలపై దాడులు నిర్వహించారు. గిరిజన ప్రాంతమైన టబాగాం గ్రామ పొలిమేరల్లో నిర్వహించిన ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. చాపరాయిలో సారా అమ్ముతున్న సవర శ్రీనాథ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సారా రవాణాకు వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం ఇంటెలిజెన్స్ వింగ్ సీఐ కూర్మారావు, పలాస డివిజన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రకుమార్, ఎస్ఈబీ సోంపేట ఎస్ఐ వై.చంద్రమోహన్, వైవీకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు. చిత్రంలో వీసీ కె.ఆర్.రజని తదితరులు

- పల్సస్ సీఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు
- అంబేడ్కర్ వర్సిటీలో రెండు రోజుల టెక్నికల్ ఫెస్ట్ వైబ్రెంట్ విస్టా- 2024 ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యలో పరిశోధన, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యమివ్వాలని పల్సస్ కంపెనీ(విశాఖ) సీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. ఎచ్చెర్లలోని అంబేడ్కర్ వర్సిటీలో అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న వైబ్రెంట్ విస్టా- 2024 టెక్నికల్ ఫెస్ట్‌ను వీసీ కె.ఆర్.రజనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాల్లో యువత నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు ప్రాధాన్యమిచ్చి పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉత్తరాంధ్రలో వ్యవసాయం ఆధారంగా జీవనం ఉందని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు, ఉత్పత్తులకు డిజిటల్ మార్కెటింగ్ కీలకమని చెప్పారు. ప్రాంతీయ అభివృద్ధి జరగాలంటే పారిశ్రామికీకరణ కీలకమని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలు కంటే పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. బృందాలుగా ఏర్పడి ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం డిజిటల్, ఆన్‌లైన్ మార్కెటింగ్ విస్తరిస్తోందని, ఈ అంశాలపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డాక్టరేట్, ఎంటెక్, పీజీ ఇలా ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన అవసరమని వివరించారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్ వంటి సంస్థలు చిన్న ఆలోచనలతోనే ఏర్పడి ప్రపంచంలోనే పెద్ద కంపెనీలుగా ఆవిర్భవించాయని గుర్తు చేశారు. ఇంటర్నేషనల్ జర్నల్స్ అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ సాగులో సైతం మార్పులు అవసరమని, తృణధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యానవన పంటలు, వాణిజ్య పంటలకు ప్రాధాన్యం పెరగాలన్నారు. కళాశాలలు నైపుణ్య విద్యకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

సానుకూల దృక్పథం అవసరం..

వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వర్సిటీలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సాంకేతిక అంశాలపై దృష్టిపెట్టాలని, విజేతల జీవిత గాథలు చదవాలని సూచించారు. పారిశ్రామికీకరణతోనే ప్రాంతీయ ప్రగతి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖరరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- టీడీపీ నాయకులకు స్పీకర్ తమ్మినేని సీతారాం సవాల్

పొందూరు: ఆమదాలవలస నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎవరూ చేయనంత అభివృద్ధిని చేసి చూపించానని, దీనిపై ప్రజాక్షేత్రంలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని టీడీపీ నాయకులకు స్పీకర్ తమ్మినేని సీతారాం సవాల్ విసిరారు. మంగళవారం గోకర్నపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గోకర్నపల్లి సచివాలయంలో రూ. 12,65,43,867లు సంక్షేమాన్ని ప్రజలకు అందించామని స్పీకర్ చెప్పారు. ప్రత్యక్ష ప్రయోజనాల కింద రూ.10,34,51,730, పరోక్ష ప్రయోజనాల కింద రూ.2,09,02,137లు అందించామని వివరించారు. పంచాయతీ పరిధిలోని రంగనాథపేట, మున్సీపేట, గోకర్నపల్లి గ్రామాలకు 10 రహదారులు, స్కూలు భవనాలు, వాటర్ ట్యాంకులు, ఇంటింటికీ కుళాయిలు వేయించానని చెప్పారు. ఈ అభివృద్ధి, సంక్షేమం టీడీపీ నాయకులకు కనిపించటం లేదా? అని ప్రశ్నించారు. మీకు న్యాయం జరిగితే, సంక్షేమం అందితే, మంచి జరిగితే ఓటు వేయండని అడిగే ఒకే ఒక్క నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ చింతాడ మాధురి, చింతాడ ప్రసాద్, పప్పల అన్నాజీ, తమ్మినైన కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలన సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఇండియన్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్' అన్న అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, పారిశ్రామికరంగాల్లో రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు-సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. సామాజిక న్యాయం దిశగా పాలన సాగిందని, పేదలందరికీ నేరుగా ఇంటికే ప్రభుత్వ పథకాలు చేరాయని తెలిపారు. ఉపాధి కల్పన లక్ష్యంగా అనేక పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేసిందని వివరించారు. రైతులకు ఉపయోగపడే చట్టాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు, మద్దతు ధరకు పంటలు కొనుగోలు వంటివి రైతులు జీవితాల్లో వెలుగులునింపాయని తెలిపారు.

- వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్. రజిని మాట్లాడుతూ



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

గ్రామాల స్వరూపం మారిందన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు స్వపరిపాలనకు శ్రీకారం చుట్టాయని చెప్పారు. ఫోరం వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి మాట్లాడుతూ అర్హులందరికీ సంతృప్త రీతిలో ప్రభుత్వ పథకాలు చేరాయని తెలిపారు. దళారీ లేని వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య మాట్లాడుతూ అమ్మ ఒడి, నాడు-నేడు, గోరు ముద్ద, విద్యాకానుక, జగనన్న విద్యా దీవెన , వసతి దీవెన వంటి పథకాలు పేద పిల్లలకు చదువును చేరువ చేశాయని చెప్పారు. ప్రొఫెసర్ వి.వెంకటరావు మాట్లాడుతూ సుపరిపాలన అంటే ఏమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



సదస్సులో సూచనలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త హరికుమార్

కంచిలి: కొబ్బరి సాగుకు యాజమాన్య పద్ధతులతోనే మనుగడ సాధ్యమవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. మంగళవారం మకరాంపురం పంచాయతీ పరిధిలో ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం సౌజన్యంతో కొబ్బరిసాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కొబ్బరిలో రకాలు, ఎరువుల యాజమాన్యం, కొబ్బరిని ఆశించు పురుగు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సమాచార కేంద్రం సహాయ సంచాలకుడు వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, ఉద్యాన అధికారి పి.మాధవీలత, ఉద్యాన విస్తరణ అధికారి బాలరాజు, ఉద్యాన సహాయకులు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వమరవల్లి గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

గార: వమరవల్లి గురుకులంలో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 25న రాష్ట్రమంతటా ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుప్పిలి గ్రామంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన నిమ్మ నచ్చుడు (35) మంగళవారం సాయంత్రం తన ఇంటిలోని స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతుండగా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆటోలో ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మృతి చెందాడు. ఈయనకు భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు దీపిక, యక్షిత ఉన్నారు. భార్య ఈశ్వరమ్మ ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి..మరొకరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం ఆకుల రఘునాథపురం గ్రామానికి చెందిన నందిగాం అప్పారావు(42) మృతిచెందాడు. టెక్కలి సీఐ పి.పైడయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అప్పారావు టెక్కలి నుంచి నందిగాంవైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లచ్చన్నపేట సమీపంలో సంకెళ్లమెట్ట వద్ద మలుపు తిరిగే క్రమంలో అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టాడు. దీంతో అప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. తన ద్విచక్ర వాహనం అదే వేగంతో వెళ్లి ముందున్న మరో బైకును ఢీకొట్టడంతో టెక్కలి చేరివీధికి చెందిన దండాసి పవన్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య భారతి, కుమారుడు రోహిత్, కుమార్తె శ్రావణి ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



అప్పారావు మృతదేహం

నేడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

- మిచాంగ్ తుఫాన్ సమయంలో నష్టపోయిన వారికి పంట నష్టపరిహారం
- జిల్లా వ్యాప్తంగా 661మంది రైతులకు రూ. 32.21 లక్షలు కేటాయింపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆరుగాలం కష్టపడి పండించిన పంట తుఫాన్లు ధాటికి కొట్టుకుపోవడంతో నష్టపోయిన రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటోంది. ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సాయం అందజేస్తోంది. రబీ డిసెంబర్ 2023-24లో మిచాంగ్ తుఫాన్ కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు పంట నష్టపరిహారం (ఇన్‌పుట్) సబ్సిడీ బుధవారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లావ్యాప్తంగా మిచాంగ్ తుఫాన్ సమయంలో 661మంది రైతులు నష్టపోగా వారికి రూ.32.21లక్షలు అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధికంగా ఇవ్వాలనే లక్ష్యంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడి రాయితీని ప్రభుత్వం పెంచింది. వరి, వేరుశనగ, పత్తి, చెరకు తదితర పంటలకు గతంలో హెక్టార్‌కు రూ.15వేలు ఇస్తుండగా, దాన్ని రూ.17 వేలకు పెంచారు. ఈ ఐదేళ్లలో పలు రకాల ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన 27633 మంది రైతులకు సుమారు రూ.9.60 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేశారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఇచ్ఛాపురం మండలంలో 146 మందికి రూ 7.66 లక్షలు, కవిటి మండలంలో 41 మందికి రూ.1.09 లక్షలు, శ్రీకాకుళం మండలంలో 125 మంది రైతులకు రూ.6.47 లక్షలు, గార మండలంలో 232 మంది రైతులకు రూ 12.41లక్షలు, లావేరు మండలంలో 28 మంది రైతులకు రూ.1.37 లక్షలు, ఎచ్చెర్ల మండలంలో 89 మంది రైతులకు రూ . 3.27 లక్షలు ఇవ్వనున్నారు.

రైతులకు అండగా..



తుఫాన్ల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకోవడమే ప్రభుత్వం లక్ష్యం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులను బుధవారం రైతుల ఖాతాల్లో వేయనున్నారు.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

● గురుభ్యోనమః



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: మండలంలోని లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులంతా మంగళవారం ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ముందుగా జామెట్రీ బాక్సులు అందజేశారు. అనంతరం పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారిశెల్లి రామరాజు, ప్రధానోపాధ్యాయుడు బి.వైకుంఠరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డి.ఎ.స్టాలిన్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వి.సూర్యప్రకాశ్, ఎం.శైలజ, సుభాషిని, హెచ్.అనురాధ, పి.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఇందుమతి, నీలకంఠేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ జి.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

గార : పేదల అభివృద్ధే ధ్యేయంగా నాడు తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో పడపానిపేట, నగిరెడ్డిపేట, నీలాపుపేట తదితర ఐదు గ్రామాలకు చెందిన 185 మంది రైతులకు 85 ఎకరాలకు సంబంధించి డీ- పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో రూ.12వేల కోట్లతో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించినట్లు వివరించారు. అందులో 14 లక్షల మందికి ఇళ్లు మంజూరు చేయడంతో పాటు కొత్త కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. తరతరాలుగా భూమి సాగుచేస్తున్న వారికి భూమి హక్కులు లేకపోవడం బాధాకరమని, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు పొందలేకపోవడంపై బరాటం నాగేశ్వరరావు చెప్పారని, అందుకే పట్టాలు ఇస్తున్నామని మంత్రి వివరించారు. చంద్రబాబు డబ్బున్నవాళ్ల పక్షపాతి అని, సీఎం జగన్ పేదల పక్షపాతి అని తెలిపారు. రానున్నదీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, మరో ఐదేళ్లు సంక్షేమ పాలన అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత మరో 400 ఎకరాలకు సంబంధించిన రైతులకు కూడా డి- పట్టాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరు అనిత, మాజీ ఏఎంసీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీఓ బి.కల్యాణి, పీస గోపి, వైస్ ఎంపీపీ అంధవరపు బాలకృష్ణమూర్తి, ముంజేటి కృష్ణమూర్తి, కొయ్యాన నాగభూషణం, ఊట అప్పలనాయుడు, ఉప్పాడ గణేష్, చాడి ఈశ్వరరావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



రైతులకు డి-పట్టాలు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సంక్షేమ పాలన కొనసాగిద్దాం

వజ్రపుకొత్తూరు రూరల్: పెత్తందారులకు, పేదలకు మధ్య జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని మళ్లీ సంక్షేమ పాలనను సాగించుకుందామని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొండవూరులో సర్పంచ్ కొల్లి భాస్కరరావు సమక్షంలో మంగళవారం 'గుడ్ మార్నింగ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ యోగ క్షేమాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. అనంతరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు సుమారు 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, వైస్ ఎంపీపీ వంక రాజు, వైస్ సర్పంచ్ లండ ఆనందరావు, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి అప్పన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొరికాన వాసు, బూత్ కన్వీనర్ లండ సూర్యనారాయణ, పార్టీ నాయకులు కె.అప్పారావు, దట్టి నాగేష్, వై.శ్రీనివాసరావు, సింహాచలం, కర్రి పాపారావు తదితరులు పాల్గొన్నారు.



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, నాయకులు

బైక్ పార్కింగ్ గొడవ

- వృద్ధుడి మృతి.. ఇద్దరిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: బైక్ పార్కింగ్ గొడవ ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. కుప్పిలి గ్రామానికి చెందిన యువకులు రాకేష్, ఉమారెడ్డిలు బైక్ పార్కింగ్ విషయంలో సోమవారం గొడవపడ్డారు. మంగళవారం ఉదయం కూడా ఇదే విషయమై తగదాకు దిగారు. బైక్ ఎందుకు తొలగించ లేదని రాకేష్‌ను ఉమారెడ్డి, అతని తల్లి హరిలక్ష్మి నిలదీయగా వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు కలగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇంతలో రాకేష్ తాత కిల్ల అప్పలస్వామి (65) వచ్చి మనవడిని మందలించే ప్రయత్నం చేయగా.. ఆ సమయంలో జరిగిన తోపులాటలో కిందపడి అపస్మారక స్థితికి చేరుకుని ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతికి కారణమైన ఉమారెడ్డి, తల్లి హరిలక్ష్మిపై కేసు నమోదు చేశారు. వృద్ధుడు తోపులాట వల్ల గాయపడి మృతి చెందాడా, ఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న అంశం పోస్టుమార్టం నివేదికలో తెలుస్తుందని ఎస్సై చిరంజీవి తెలిపారు.